2. నేనెవర్ని సంతోష పెట్టాలి?

పిల్లలు సంతోషపెట్టవలసింది పెద్దలను! ఎలా సంతోషపెట్టాలో పెద్దలే పిల్లలకు తెలిసేలా చెయ్యాలి. 'పెద్దలను సంతోషపెట్టడం ద్వారా తాము కూడా సంతోషంగా వుండవచ్చు' అన్న విషయం పిల్లలకు మనసులో నాటుకునేలా చేయాలంటే, 'పిల్లలను సంతోషపెట్టడం ద్వారా తాము సంతోషంగా వుంటున్నాము' అన్న విషయం పెద్దలు గ్రహించాలి.

మా రైటర్స్ వర్‌షాప్‌లో ఒక అసిస్టెంట్ పద్దెనిమిదేళ్ళ అమ్మాయి - బాగా పాటలు పాడుతుంది. సాయంత్రం ఆరునుంచి పదకొండింటి వరకు పబ్లిక్ ప్రోగ్రామ్స్‌లో పాటలు పాడి రోజుకు మూడువందల నుండి అయిదు వందలదాకా సంపాదిస్తుంది.

నెలకి పదివేలవరకు తన తండ్రికి పంపిస్తూ గతంలో తన తండ్రి చేసిన లక్షరూపాయల అప్పులో దగ్గిర దగ్గిర డెబ్బయి వేల వరకూ తీర్చేసింది. ఆమె ఈ విధంగా కష్టపడటానికి కావలసిన స్ఫూర్తిని 'తండ్రియొక్క అప్పులు తీరుస్తున్నాను' అన్న సంతృప్తి పొందుతుంది.

మీకు మీ పిల్లలకు మధ్య సంబంధాలు ఎంత బలమైనవో, దుష్టసాహసం నుంచి వచ్చవి వత్తిడి అంతకంటే బలంగాను, దృఢంగాను వుంటుంది. పిల్లలు కూడా అటువైపు తొందరగా ఆకర్షితులవుతారు. మీరు గమనించి చూస్తే పధ్నాలుగేళ్ళ వయస్సులో ప్రేమలోపడిన ఆడవాళ్ళంతా తల్లిదండ్రులతో మంచి సంబంధాలు లేనివాళ్ళే అయి వుంటారు.

3. నా లక్ష్యం ఏమిటి?

ఇలాంటి నిర్ణయాన్ని తీసుకునేముందు మానసిక స్థయిర్యాన్ని, శారీరక ధృఢత్వాన్ని, బలహీనతల్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఒక బలహీనంగా వున్న కుర్రవాడ్ని వాళ్ళ తండ్రి ఒక సైనికుడ్ని చెయ్యాలని ముందునుంచే ప్లాన్ వెయ్యకూడదు.

తార్కికజ్ఞానం, మంచి తెలివితేటలు లేని పిల్లవాడిని చార్టెడ్ అకౌంటెంటో, ఇంజనీరో చెయ్యాలనే ఆశని చిన్నప్పటినుంచే వదిలేసుకోవాలి. లేకపోతే అతనిలో ఆ బలహీనతల్ని ఎలా రూపుమాపాలో ఆలోచించుకోవాలి.

నేను ఆరో క్లాసు చదువుతున్నప్పుడు తల్లి దండ్రులు పెంపకంలో కాకుండా బయటి పెంపకంలో పెరగడం వల్ల లెక్కల్లో పది మార్కులలోపే రావడం వల్ల పరీక్ష పోవటం నాకు బాగా గుర్తుంది. ఆ తరువాత నేను అనంతపూర్ సాయిబాబా స్కూల్లో చదివినప్పుడు ఒక మంచి మాస్టారు శ్రద్ధ తీసుకోవడం వల్ల ఆ సంవత్సరం నూటికి నూరు మార్కులు రావడం కూడా నాకు గుర్తుంది.

ఆ తరువాత ఛార్టెడ్ అకౌంటెన్సీలో కాస్ట్ అకౌంట్స్, అకౌంట్స్‌లలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించగలిగాను. ఒక మనిషి ఒక బలహీనతను అధిగమించడం పెద్ద కష్టమేమీ కాదు. అలా అధిగమించలేని పక్షంలో ఆ రంగాన్ని వదిలేసి వేరే రంగాన్ని ఎన్నుకోవడం కూడా

అసాధ్యమేమీ కాదు.

4. నా లక్ష్యాన్ని సాధించడంలో నేనెక్కడ వున్నాను?

ప్రతి మూడు నెల్లకో, ఆరునెల్లకో మీ పిల్లవాడు తన గమ్యాన్ని సాధించడానికి ఎంత దూరంలో వున్నాడు? అన్న విషయాన్ని గమనిస్తూ వుండాలి. మంత్లీ పరీక్షల్లో, హాఫ్ఇయర్లీ పరీక్షల్లో మార్కులు సరిగా రాకపోతే 'ఫైనల్లో మావాడు పాసయితే చాల్లే. మంచి మార్కులు రాకపోయినా ఫరవాలేదు' అన్న అభిప్రాయం ఏర్పరచుకోకూడదు.

అలాగే ఒక పిల్లవాడు గంజాయికో, మరే మత్తుమందుకో అలవాటుపడితే ఎంత తొందరగా గ్రహిస్తే అంత మంచిది. ముఖ్యంగా ఆడపిల్లలున్న తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రేమలో పడితే సులభంగా పట్టుకోగలరు.

అప్పటివరకు చురుగ్గా వున్న అమ్మాయి మౌనంగా వుండటం, ఉదాసీనంగా వుండటం, ఏదో ఆలోచిస్తూ వుండటం, ఇలాంటివన్నీ ప్రేమలోపడిన లక్షణాలు. తల్లిదండ్రులు తమ కూతురు ప్రేమలో పడిన విషయాన్ని ఆ అమ్మాయి చెప్పేవరకు గుర్తించకపోతే, అది ఆ తల్లిదండ్రులకు తమ కూతురిపై సునిశిత దృష్టి లేదన్న విషయాన్ని సూచిస్తుంది.

పిల్లలు తమ లక్ష్యాలకు ఎంత దూరంలో వున్నారన్న విషయం గుర్తించవలసింది ఈ విధంగా తల్లిదండ్రులే.

సంబంధాలు :

ఆస్తిపాస్తులు ఏమీ లేకపోయినా, తల్లిదండ్రుల్ని ఆసుపత్రిలో వుంచడానికి వేలకి - వేలు ఖర్చయినా పిల్లలు పెదవి బిగువున కష్టాలు అదిమిపెట్టి, ఏదో విధంగా డబ్బు సంపాదించి, తల్లిదండ్రుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం కష్టపడటం మనం చూస్తూనే వున్నాం. రోజురోజుకి ప్రపంచం మెటీరియలిస్టిక్‌గా మారుతోంది.

మానవ సంబంధాన్ని ఆర్థిక సంబంధాలు ఏ విధంగా డామినేట్ చేస్తాయో నా లేటెస్ట్ నవల 'అంతర్ముఖం'లో క్లియర్‌గా రాశాను. ఇటువంటి పరిస్థితులు ఏర్పడకుండా వుండాలంటే మనుష్యుల మధ్య (ముఖ్యంగా తండ్రి, పిల్లలమధ్య) మంచి సంబంధాలు వుండాలి.

మంచి సంబంధాలు పాటించే విధానాలు నాలుగు.

1. సున్నితత్వం
2. ఒప్పందం
3. ప్రశ్నించే స్వేచ్ఛ.
4. అవగాహన.

1. సున్నితత్వం :

'ప్రపంచంలో తల్లిదండ్రులకు అత్యంత విలువైన నిధి తాము' అని ప్రతి పిల్లవాడికి తెలియాలి. ఈ విషయం పిల్లలు తెలుసుకోవాలంటే తల్లిదండ్రులు వీళ్ళని సున్నితంగా హాండిల్ చెయ్యాలి. 'స్కూలయిపోగానే ఇంటికి వెళ్ళాలి. ఇంటి దగ్గర తన తల్లి ఎదురు చూస్తుంటుంది' అన్న భావన పిల్లల్లో కలగాలంటే ఆ తల్లి పిల్లవాడ్ని ఎంతో ఆప్యాయతతో పెంచవలసి వుంటుంది.

పిల్లల్ని దండించవలసిన సందర్భాలు అనేకం రావచ్చు. దానికి తగినట్లుగానే తల్లులు, తండ్రులు ప్రవర్తించవచ్చు. మామూలుగా వున్న సముద్రం తుఫాను వచ్చినప్పుడు ఆటుగా, పోటుగా పైకొచ్చినా మిగతా సమయాల్లో మామూలుగా వుంటూ మేఘాలద్వారా మనుషుల్ని రక్షిస్తుంది. అలాగే కోపం వచ్చినప్పుడు దండించినా, మిగతా సమయాల్లో నిలకడగా ప్రేమ చూపించవలసిన బాధ్యత తల్లిదండ్రులదే. దీనికి కొన్ని సలహాలు:

___ మీరు పిల్లలతో తప్పుగా ప్రవర్తించినట్లు మీకనిపిస్తే అది మీ పిల్లల దగ్గర ఒప్పుకోండి. (ఈ పుస్తకం మొదట్లో వ్రాసిన ఒక పాప ఇంగ్లీషు ఆర్టికల్ మళ్ళీ ఇంకొకసారి చదవండి)

___ వారి చేతిని స్పృశించడం గానీ, వాళ్ళని దగ్గరకు తీసుకోవడం గానీ అప్పుడప్పుడు చేయండి. అది ఆప్యాయతను సూచిస్తుంది.

___ మరీ గంభీరంగా వుండటం మీ వ్యక్తిత్వాన్ని చూచించవచ్చుగానీ మీ పిల్లల దగ్గర మాత్రం గంభీరంగా వుండండి. వాళ్ళు ఏ విషయంలోనైనా బాధపడితే మీరు బాధపడకండి. సానుభూతి చూపండి.

___ జాగ్రత్తగా వినండి. లెక్చర్లు ఇవ్వద్దు.

2. ఒప్పందం :

ఏ పిల్లవాడికైనా తమ తల్లిదండ్రులు తమను ప్రేమతో బంధించారు అన్న ఊహ ఎంత గొప్ప సంతృప్తినిస్తుంది. ఇంతకుముందు ఛాప్టర్‌లో ఒక పాప ఇంటికి ఆలస్యంగా వస్తే వేరు వేరు తల్లిదండ్రులు ఎలా ప్రవర్తిస్తారో రాయడం జరిగినది. ఆ పాప ఇంటికి ఆలస్యంగా వస్తే తల్లి దండ్రులు పట్టించుకోకపోతే మొదట్లో చాలా బాధపడింది. క్షణం క్షణం మన ప్రేమను నిరూపించుకోవలసిన 'ఆవశ్యకత' ఎంతో వుంది. దీనికి కొన్ని సలహాలు.

___ ప్రతి సాయంత్రం మీ పిల్లలని ఆ రోజు ఎలా గడిచిందో అడిగి తెలుసుకోండి.

___ వాడి కార్యక్రమాల్లో పాలుపంచుకోండి.

___ మీ పిల్లవాడి స్కూలుకెళ్ళి వాడి అభివృద్ధి ఏయేరంగాల్లో ఎలా ఉందో అడిగి తెలుసుకోండి.

— స్కూల్ యానివర్సల్ ఫంక్షన్‌కి, పేరెంట్స్ డేకి, ప్రోగ్రస్‌కార్డు ఇచ్చినప్పుడు మీ భార్యనొక్కదాన్నే పంపకుండా తప్పకుండా మీరు గాని లేక ఇద్దరూ కలిసిగాని వెళ్ళండి. అది మంచి పద్ధతి.

— మీ పిల్లలంటే మీ కెందుకు గర్వమో వాళ్ళకు తెలిసేలా చెయ్యండి.

3. ప్రశ్నించే స్వేఛ్ఛ :

పిల్లలకి పెద్దలను ప్రశ్నించే స్వేచ్ఛ కావాలి. మీ పిల్లలు ఓపెన్‌గా నిజాయితీగా వుండటానికి ఎంత స్వేచ్ఛనిస్తారో, అంతగా వళ్ళ విలువల్ని పెంచడానికి కూడ తోర్పడతారు. కుటుంబ సభ్యుల మధ్య కూడ 'ఇంటరాక్షన్' బాగా పెరుగుతుంది.

మీ పిల్లలు మిమ్మల్నడిగే సమంజసమైన ప్రశ్నలకు ఉచితమైన సమాధానాలివ్వండి. ఎక్కడైతే పిల్లలకు ప్రశ్నించే స్వేచ్ఛ లేదో అక్కడ వాళ్ళ ఫీలింగ్స్‌ని నొక్కి పెట్టేస్తారు. ఆ విధంగా చేయడం వల్ల ఆ ఫీలింగ్స్ వాళ్ళలో అగ్నిపర్వాతాల్లా కుత కుత ఉడికి ఒక్కసారిగా పేలతాయి. అప్పుడు ఆ ఫీలింగ్స్‌ని బయటి వ్యక్తులతో పంచుకోవడానికి ఇష్టపడతారు. మీకు మానసికంగా దూరమవుతారు.

4. అవగాహన :

మనమీద మన గతం తాలూకు ప్రభావం, మన చుట్టూ వున్న పరిసరాల ప్రభావం స్పష్టంగా మనకు అవగాహనై వుండి. ఇద్దరు వ్యక్తులు పెళ్ళి చేసుకున్నప్పుడు, రెండు గతాలు కలిసి ఒక వర్తమానంగా జీవించడం ప్రారంభిస్తాయి. ఆ వర్తమానమే తల్లిదండ్రులుగా రూపుదిద్దుకొని పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతుంది. మనకి మన గతం ఒక అనుభవం. మన పిల్లలకి మనమే ఒక అనుభవం. కాబట్టి గతంలో మనం నేర్చుకున్న పాఠాల్ని తెలియజెప్పేలాగ ప్రయత్నించాలి.

నేను నా ముప్పైవ సంవత్సరంలో జేమ్స్‌హాడ్లి ఛేజ్, ఆర్థర్ హేవీ నవలలు చదివేవాడిని. ఆ తరువాత ఆరేడు సంవత్సరాలకి అసిమోవ్, అయినెస్కో వంటి సైంటిస్టుల పుస్తకాలు చదవడం జరిగింది. మా అబ్బాయికి నేను పదిహేనవ సంవత్సరంలోనే అసిమోవ్ పుస్తకాలిచ్చి వాడి కర్థంకాని విషయాల్ని చెప్పడం ద్వారా మిల్స్ అండ్ బూన్,అ జేమ్స్ హాడ్లీ చేజ్ లాంటి మామూలు పుస్తకాల స్థాయినుంచి ఒకమెట్టు పైకి గెంతించి మంచి పుస్తకాల పట్ల అవగాహన ఏర్పరచగలిగాను.

నా ముప్పయి సంవత్సరాల వయసు అనుభవాన్ని నేను నా కుమారుడికి చెప్పకపోయి వుంటే వాడికి కూడా ఆ పుస్తకాలు చదవడానికి మరో పదిహేను సంవత్సరాలు పట్టేది. ఈ విధంగా పదిహేను సంవత్సరాల అనుభవాన్ని (పుస్తకాలకు సంబంధించి)అతనికి ఇవ్వగలిగాను.

ఒకేసారి మూడో మెట్టుమీదకి వెళ్ళిన ఆ పిల్లవాడికి నాలుగో మెట్టుమీదకి, అయిదో మెట్టుమీదకి చేరడానికి బహుశా నాకు పట్టినన్ని సంవత్సరాలు పట్టకపోవచ్చు.

.... చాలా సందర్భాలలో మన గతం మనకి మేలు చేసేదిగానే వుంటుంది. మనకెదురైన సమస్యలు - వాటిని పరిష్కరించిన విధానం, మన అనుభవాలు మన పిల్లలకి వివరించి చెప్పగలిగితే, ఇవన్నీ జీవిత సోపానాలుగా ఉపయోగపడతాయి.

చీకటి కోణాలు :

ప్రతిమనిషికీ చీకటి కోణాలు కొన్నుంటాయి. ఒక తండ్రికి బాగాతాగే అలవాటు వుండవచ్చు. ఒక తల్లికి బంగారం పట్ల, చీరెలపట్ల బాగా పిచ్చి వుండవచ్చు. తమ చీకటి కోణాల్ని పిల్లలు అర్థం చేసుకునేలాగ చెయ్యాలి.

తమ బలహీనతల నుంచి బయటపడటానికి తామెంత కష్టపడుతున్నారో, అలా పడలేక కుటుంబానికి ఎంత నష్టం వస్తుందో పిల్లలకి అర్థమయ్యేలా చెబితే వాళ్ళలో ద్వేషం స్థానే ఒక విధమైన జాలి కలుగుతుంది. 'తామెలాగూ చెడిపోయాం, తమ పిల్లలనన్నా మంచి మార్గంలో పెడదాం' అన్న అభిప్రాయం ప్రతి తల్లీ తండ్రికి ఈ చీకటి కోణాల పట్ల వుండాలి.

అలాంటి పరిస్థితిలో పెరిగిన పిల్లలు తిరుగుబాటు ధోరణిని పెంచుకోకుండా సానుభూతి భావాన్ని అలవర్చుకుంటారు. చీకటి కోణాలు ఏర్పడే కారణాలు మూడు విధాలుగా విభజించవచ్చు.

1. అలవాటు.
2. భయం.
3. పదే పదే అదే తప్పు చేయటం

1. అలవాటు :

పాత పద్ధతుల్నించి మారటానికి ధైర్యం కావాలి. మానసిక సామర్థ్యం కావాలి. తనమీద తనకి కంట్రోల్ కావాలి. కానీ చాలామంది మనుష్యులకి ఈ మూడూ వుండవు. ముఖ్యంగా తండ్రులు ఎప్పుడైతే ఒక కుటుంబానికి అధికారై పెత్తనం చలాయించడం మొదలుపెడతాడో అప్పుడు వాళ్ళని ఆపేవారు ఎవరూ వుండరు. 'ఈ అలవాటువల్ల నేను ఆనందాన్ని పొందుతున్నాను. ఈ ఆనందాన్ని కాదనే హక్కు మీకేముంది?' అనే ధోరణిని ఈ కుటుంబ పెద్దలు అలవాటు చేసుకుంటారు. అలాంటప్పుడు పిల్లలు కొంతకాలం అణిగి మణిగి వున్నా తరువాత తిరుగుబాటు ధోరణిని అలవాటు చేసుకుంటారు.

2. భయం :

ప్రతి మనిషి ఎందుకు భయపడతాడు అన్నదానికి చాలా రకాలుగా చాలా

కారణాలున్నాయి. కొంతమంది చీకటిని చూస్తే భయపడతారు. మరికొంతమంది నాలుగంతస్తుల మేడ మీదనుంచి క్రిందకు చూస్తే భయపడతారు. కొంతమంది రేపు మధ్యాహ్నం ఒంటిగంట ట్రైనుకి వెళ్ళాల్సివుంటే ఈ రోజు సాయంత్రం నుంచే అదొరకమైన టెన్షన్‌తో భయపడతుంటారు. కొంతమంది రేపు ఉరిశిక్ష అన్నా కూడా ఈ రాత్రి చాలా నిబ్బరంగా ఉండగలుగుతారు. భయం వేరు వేరు స్థాయిల్లో మనుషుల్ని బాధపెడుతూ వుంటుంది. తమకి భయమన్నా కూడా పిల్లల ముందు తమ కటువంటి అభద్రతా భావమేదీ లేదని నిరూపిస్తూ వుండాలి. ఇది చాలా లౌకికపరమైన నాటకీయత అయినా కూడా అలా చెయ్యడం తప్పదు.

3.పదేపదే అదే తప్పు చేయుటం :

'కష్టలు వాటంతట అవే పోతాయ్. తప్పకుండా మంచిరోజు అదే వస్తుంది' అనుకొని పాత పద్ధతుల్ని కొనసాగించడం చాలా పురాతనమైన పద్ధతి. ఈశాన్యం వైపు బావి తవ్వడం ద్వారాకాని, చేతికి రక్షణరేఖ కట్టుకోవడం ద్వారాగాని, జ్యోతిష్యం చెప్పించుకోవడం వల్ల కాని మంచిరోజులు రావు. మంచిరోజులు మంచి వ్యక్తిత్వం పెంచుకుంటే వస్తాయి.

మనం కష్టాల్ని ఎదుర్కొనే ధైర్యాన్ని పెంపొందించుకుంటే వస్తాయి. మనం ఎన్ని కష్టాల్లో వున్నా కూడా మన పిల్లలకి అది తెలియనివ్వకపోవటమే మంచిది. మరీ కష్టలు ఎక్కువై, వాటివల్ల పిల్లలు బాధపడుతుంటే అప్పుడు వారిని కూర్చోబెట్టి చెప్పటం చాలామంచి పద్ధతి. మనం ఆర్థిక పరమైన ఇబ్బందుల్లో వుండి మన పిల్లలకి ఒక పూట అన్నం పెట్టలేకపోతే వీలైనంత వరకు అన్నం పెట్టడానికే ప్రయత్నించాలి.

కానీ ఆ విషయం పిల్లలకి తెలియనివ్వకూడదు. అన్నం పెట్టడం దాదాపు దుర్లభం అయినప్పుడు ఆ పిల్లలను కూర్చోబెట్టి తామెందుకు అన్నం పెట్టలేకపోతున్నామో, అందుకవసరమైన డబ్బుకోసం తామెంత కష్టపడుతున్నామో, అయినాకూడ ఆ డబ్బెందుకు దొరకటం లేదో, అందువల్ల పిల్లలకు అన్నం పెట్టలేకపోతున్నందుకు తాము ఎంత బాధపడుతున్నామో తెలియజేయండి.

పిల్లలు కూడా తండ్రికి ఏ విధంగా సహాయం చెయ్యాలా అని ఆలోచించటం మొదలుపెడతారు. (ఇక్కడ ఒక పూట తిండి లేకపోవటం అన్నది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే) చిన్న చిన్న కష్టాలను కూడా పంచుకోవటం ద్వారా మానసిక సంబంధాలు బాగుపడతాయనే ఈ రచయిత ఉద్దేశ్యం.